క్లుప్తంగా

కల్వర్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

సంగారెడ్డి టౌన్: ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వినయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మునిపల్లి మండలం అంతారం గ్రామానికి చెందిన బేగరి వెంకటేశం (40) కూలి పనులు చేసుకుని జీవిస్తున్నాడు. సోమవారం పోతిరెడ్డిపల్లి శివారులో హిందు శ్మశాన వాటిక ఎదుట నేషనల్ హైవే 65 రోడ్డుపై గల కల్వర్టుపై నుంచి ప్రమాదవశాత్తుగా జారి పడి మరణించాడని మృతుడి భార్య పార్వతమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

సంగారెడ్డి టౌన్: అప్పుల బాధ భరించలేక మద్యం మత్తులో యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంగారెడ్డి రూరల్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన సుకాలు కుటుంబ సభ్యులతో కలిసి సంవత్సర క్రితం సంగారెడ్డి పరిధిలోని పోతిరెడ్డిపల్లికి వలస వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సుకాలు పెద్ద కుమారుడు రామ్సిన్ బైత తల్లిదండ్రులతో కలిసి ఉండేవాడు. అప్పుడప్పుడు తమ సొంత గ్రామానికి వెళ్లి వస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో చేసిన అప్పులు తీర్చలేక మద్యానికి బానిసై సోమవారం తండ్రి పనిచేసే పరిశ్రమ ఆవరణలో చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'జగన్‌మోహన్‌రెడ్డిని సస్పెండ్ చేయండి'



మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జోగిపేట(అందోల్): పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌కు అందోల్ బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలిపారని ఆరోపించారు. అదేవిధంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న మరికొంత మందిని కూడా సస్పెండ్ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు నాగరత్నంగౌడ్, సుధాకర్‌గౌడ్, వినోద్ రెడ్డి, పోచయ్య, గోపాల్, శ్రీనివాస్, సతీష్, బాలరాజ్ తదితరులు ఉన్నారు.

బైక్ మెకానిక్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పురుషులకు స్వయం ఉపాధి కల్పనలో భాగంగా బైక్ మెకానిక్‌లో ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణా కేంద్రం డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగినవారు సర్టిఫికెట్లతో పట్టణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంలో హాజరు కావాలన్నారు. ఈనెల 18 నుంచి నెల రోజులపాటు శిక్షణ ఉంటుందని.. వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లా యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9704446956, 94901 29839 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బీజేపీ శ్రేణుల ఇంటింటి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

జోగిపేట(అందోల్): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జోగిపేటలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ జహీరాబాద్ ఎంపీగా బీబీపాటిల్‌ను గెలిపించాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అందోల్ నియోజకవర్గ బీజేపీ కోకన్వీనర్ మహేష్కర్ సుమన్, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు శివశంకర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నవీన్, నాయకులు ప్రభాత్‌కుమార్, మాణయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

యథేచ్ఛగా వ్యర్థాల పారబోత

- పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయనాలు
- గుట్టలుగా పేరుకుపోతున్న వ్యర్థాలు
- నిబంధనలను పాటించని పరిశ్రమల యాజమాన్యాలు
- కన్నెత్తి చూడని పీసీబీ అధికారులు



బొల్లారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమకు సమీపంలో కాల్చివేస్తున్న వ్యర్థాలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల పరిధిలోని ఖాజీపల్లి, బొంతపల్లి, బొల్లారం, గడ్డపోతారం, తదితర పారిశ్రామికవాడల్లో దాదాపు 150 వరకు వివిధ రకాల రసాయన పరిశ్రమలు ఉన్నాయి. అయితే ఈ పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థాలను ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ కాల్చివేస్తుండటంతో పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యం పూర్తిగా దెబ్బ తింటోంది. నిబంధనల ప్రకారం... పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థ ఘన పదార్థాలను వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంటుకు తరలించాలి. ఈ తరలింపునకు ఖర్చు కూడా భారీగా అవుతుంది. దీంతో ఖర్చును తగ్గించుకునేందుకు పరిశ్రమల యాజమాన్యాలు ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ వ్యర్థాలను పారబోస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి.

ఇటీవల బొంతపల్లి, గడ్డపోతారం పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల యాజమాన్యాలు భారీగా వ్యర్థాలను కాల్చివేస్తున్నాయి. దీంతో ఘాటు వాసనలు రావటంతో పాటు మంటలు ఎగిసిపడుతున్నాయి. బొల్లారంలోని పలు రసాయన పరిశ్రమల యజమాన్యాలు కూడా ఇదే తంతుగా వ్యవహరిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయంలో వ్యర్థ ఘన పదార్థాలను కాల్చివేస్తున్నాయి. పారిశ్రామికవాడల్లో వ్యర్థాలను కాల్చివేయటం పరిపాటిగా మారిందని స్థానిక ప్రజలు పరిశ్రమల యజమాన్యాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

వ్యర్థాలను కాల్చివేస్తున్న పరిశ్రమలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఇప్పటికే అనేక పరిశ్రమలకు నోటీసులను కూడా ఇచ్చాం. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదు. తనిఖీలను వేగవంతం చేసి నిబంధనలు పాటించని పరిశ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. – కుమార్ పాఠక్, పీసీబీ ఏఈ

కానరాని పీసీబీ అధికారుల తనిఖీలు

పరిశ్రమల వ్యర్థ పదార్థాలను ఇష్టానుసారంగా కాల్చివేస్తున్నా సంబంధిత పీసీబీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, పరిశ్రమల యాజమాన్యాలకు తొత్తులుగా మారారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు.

ఉగాది పంచాంగం ఆవిష్కరణ

జహీరాబాద్: బ్రాహ్మణ సమాజ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలో ఉగాది పంచాంగం పుస్తకాలను ఆవిష్కరించారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి పునిత్ దీక్షిత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బ్రాహ్మణులు ఉన్నంత కాలం సనాతన ధర్మం నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజ సేవా సంస్థ అధ్యక్షుడు రాజ్‌కుమార్ దేశ్‌పాండే, మహిళా అధ్యక్షురాలు సరస్వతీ కుల్‌కర్ణి, కార్యదర్శి బాల్‌చందర్ జోషితో పాటు కృష్ణారావు కుల్‌కర్ణి, శ్రీహరి జోషి, వసంత్‌రావు కుల్‌కర్ణి, నర్మదా దేశ్‌పాండే, మంజుల కుల్‌కర్ణి, భవానీ, అఖిల జోషి, కవిత పాల్గొన్నారు.

ఆ కళాశాలపై చర్యలు తీసుకోండి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్



కళాశాల ఎదుట బైఠాయించిన విద్యార్థి సంఘాల నాయకులు

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులకు సెలవులు ఇవ్వని రుద్రారం శ్రీ చైతన్య జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు నల్లవల్లి రమేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. సోమవారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రుద్రారంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో చదువుతున్న ప్రథమ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాసి ఇంటికి వెళ్లడంతో మళ్లీ సెకండ్ ఇయర్ ప్రారంభం అవుతున్నట్లు తల్లిదండ్రులకు ఫోన్ చేసి రప్పించారని తెలిపారు. ఫస్ట్ ఇయర్ ఎగ్జామ్స్ రాసిన తర్వాత వారికి సెలవులు ఇవ్వకుండా సెకండ్ ఇయర్ సిలబస్ ప్రారంభించడం సరికాదన్నారు. విద్యార్థులకు సెలవులు ఇవ్వకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు రవి కిరణ్ గౌడ్, తుక్కారాం సాయి, రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కలెక్టర్ ఏఓకు వినతిపత్రం అందజేత

సంగారెడ్డి టౌన్: విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే సెకండియర్ విద్యార్థులకు సిలబస్ ప్రారంభించి క్లాసులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుద్రారంలో శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలు రాశారన్నారు. విద్యా సంవత్సరం పూర్తి కాక ముందే వారికి సెకండియర్ సిలబస్ పేరుతో క్లాసులు ప్రారంభించారన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ ఏఓకు వినతిపత్రం అందజేశారు.

08 ఎస్ ఎన్ జి 32: కలెక్టర్ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిబంధనలు పాటించని పాఠశాలలు

నారాయణఖేడ్: నిబంధనలను తుంగలో తొక్కుతూ అనుమతి లేకున్నా ప్రవేశాలను ప్రారంభించిన ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా నాయకులు సీహెచ్. అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం ఖేడ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని పలు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియకుండానే అనుమతులు లేకున్నా వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాలు ప్రారంభించాయన్నారు. పెద్ద మొత్తంలో ఫీజులను వసూలు చేస్తూ పుస్తకాలు, యూనిఫామ్‌లు సైతం విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు.

పండగలు సంతోషంగా జరుపుకోవాలి



ఇఫ్తార్‌విందులో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహా

మంత్రి దామోదర రాజనర్సింహా

నారాయణఖేడ్: పండుగలు సంతోషంగా జరుపుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకొని ఖేడ్ సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్‌షెట్కార్, ఖేడ్, జుక్కల్ ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, లక్ష్మీకాంతరావు, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా వారితో పాటు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యులు నగేష్‌షెట్కార్, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, శంకరయ్యస్వామి, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు రషీద్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ సర్పంచ్ అప్పారావు షెట్కార్, కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, సాగర్‌షెట్కార్, తాహెర్, రమేశ్‌చౌహాన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భారతినగర్ డివిజన్ పరిధిలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీకాలనీలో కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కంది(సంగారెడ్డి): పండుగలను కుల మత భేదాలు లేకుండా అందరూ కలిసిమెలిసి సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే చింతాప్రభాకర్ సూచించారు. మండల పరిధిలోని బేగంపేటలో సోమవారం బీఆర్ఎస్ జిల్లా నాయకులు సాయగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు చింతాప్రభాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. జెడ్పీటీసీ కొండల్ రెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో జగ్గారెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని పిట్లలకేరీలో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణ పరిధిలోని ముస్లింలందరూ భారీగా హాజరయ్యారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపల్లిలో ఇఫ్తార్ విందు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఖాజీపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ముస్లింలకు కాంగ్రెస్ నాయకులు ఇఫ్తార్ విందు ఇచ్చారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, కౌన్సిలర్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు భార్గవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



అరుణ్‌కుమార్(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఓ పరిశ్రమకు చెందిన బస్సు ఢీకొనడంతో విద్యార్థి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన ఆకుల అరుణ్ కుమార్ (23) రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా సోమవారం సాయంత్రం హాస్టల్ నుంచి ఇస్నాపూర్‌లో ఉండే స్నేహితుడి రూమ్‌కు బైక్‌పై వెళ్లి వస్తుండగా ఇస్నాపూర్ గురుకులం పాఠశాల సమీపంలోనికి రాగానే ఓ పరిశ్రమకు చెందిన బస్సు ఢీకొట్టింది. దీంతో అరుణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఆకుల ఆంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు కోర్టు జరిమానా విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం, ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నామన్నారు. పట్టుబడిన వాహన దారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి ఒక్కొక్కరికీ రూ.వెయ్యి చొప్పున 14 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



గీతం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న వక్తలు

పటాన్‌చెరు: మనకు తెలియని చిరు ధాన్యాలు (మిల్లెట్లు) ఎన్నో రకాల జాతులు ఉన్నాయని, వాటిని వినియోగించి స్థిరమైన పోషణ, ఆరోగ్యాన్ని ప్రోత్సహించవచ్చని వక్తలు అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో 'వ్యవసాయ–ఆహార పర్యావరణ వ్యవస్థలో చిరుధాన్యాలు, తినదగిన అడవి జాతులను ప్రధాన స్రవంతిలోకి తేవడం ' అనే అంశం పై సోమవారం వర్క్ షాప్ నిర్వహించారు. గీతం విశ్వ విద్యాలయంలోని సెంటర్ ఫర్ హెల్త్ అండ్ ఇన్నోవేషన్ (సీహెచ్ఎడబ్ల్యూఐ), బ్రిటన్‌లోని, కోవెంట్రీ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ అగ్రోకాలజీ, వాటర్ అండ్ రెసిలెన్స్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ వర్క్ షాప్ లో పలు రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. కోవెంట్రీ వర్సిటీకి చెందిన డాక్టర్ లోపాముద్ర పట్నాయక్ సక్సేనా, ప్రొఫెసర్ న్యూ చార్లెస్వర్త్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ చెందిన డాక్టర్ పీ.ఎం మాలతీ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ఆహారం, పోషకాహార విభాగానికి చెందిన ప్రొఫెసర్ టీ.ఎం హిమవతి, ఒడిస్సా మిల్లెట్ మిషన్కు చెందిన దినేష్ బాలం, వాసన్‌కు చెందిన జయప్రకాష్, రిచ్ నుంచి డాక్టర్ జోనాథన్ ఫిలాయ్, మిల్లెనోవా ఫుడ్స్ వ్యవస్థాపకురాలు సౌమ్య ముందారపు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



మాట్లాడుతున్న గాలి అనిల్‌కుమార్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే లోకసభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు, పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ కోరారు. పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ అధ్యక్షతన పట్టణంలోని అతిథి హోటల్‌లో సోమవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ రాష్ట్రం, జహీరాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. లోకసభ ఎన్నికల్లో సత్తాచాటాలని, పార్టీ అభ్యర్థి కోసం నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా శ్రమించాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రతిపక్షంపై ఆరోపణలు చేస్తుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే వృథా అవుతుందన్నారు. తనను గెలిపిస్తే అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తానని చెప్పారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, పార్టీ సమన్వయకర్త దేవిప్రసాద్, నాయకులు నరోత్తం, గుండప్ప, మోహన్‌రెడ్డి, మచ్చేందర్, గోవర్ధన్‌రెడ్డి, పెంటారెడ్డి, సరస్వతిరెడ్డి, వహీద్, ఇస్మాయిల్, ఎంపీటీసీ బస్వరాజ్, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి



మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో కరువు కాటకాలతోపాటు కరెంటు కష్టాలు ప్రారంభమయ్యాయని ఉమ్మడి మెదక్ బీఆర్ఎస్ ఎంపి అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని దుర్గ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఎలాంటి కరువు, కరెంటు కష్టాలు లేవన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క పథకం అమలు కావడం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలిపిస్తే రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రజలు సేవలందిస్తానన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా

సంగారెడ్డి టౌన్ : విద్యావంతుడినైన తాను ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డి మండలంలోని ఓ ప్రైవేట్ హాల్లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్‌గా పనిచేసి జిల్లాకు దగ్గరయ్యానని, కలెక్టర్ గా ఉన్నప్పుడు ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేశానని.. ఎంపీగా గెలవగానే పీవీఆర్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తా అన్నారు. నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయిస్తానన్నారు. పేదలకు ఒక రూపాయికే ఫంక్షన్ హాల్ ఉండేలా చేస్తానన్నారు. తాను చనిపోయినా సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, నాయకులు ఎర్రొల్ల శ్రీనివాస్, పట్నం మాణిక్యం, రాజేశ్వర్‌రావు, కసాల బుచ్చిరెడ్డి, అంజనేయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **శ్లోకా ద స్కూల్‌కు గుర్తింపులేదు**

సంగారెడ్డి అర్బన్: పపట్టణంలో అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న శ్లోకాద స్కూల్ పై డీఈఓ వెంకటేశ్వర్లు చర్యలు తీసుకున్నారు. ఆ పాఠశాలకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎలాంటి ప్రభుత్వ గుర్తింపు లేదని ఎవరూ అడ్మిషన్ తీసుకోకూడదని డీఈఓ సూచించారు. పాఠశాలలో విద్యార్థుల నుంచి అడ్మిషన్ తీసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ **జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదం**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదం చేస్తాయని మండల విద్యాధికారి దండు అంజయ్య అన్నారు. మండల పరిధిలోని నందికంది ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల గ్రంథాలయానికి ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వివిధ గ్రంథాలను, పాఠ్య పుస్తకాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విజ్ఞానాన్ని పెంపొందించేది గ్రంథాలయాలేనని, ప్రతిఒక్కరూ పుస్తకపఠనం అలవరుచుకోవాలని సూచించారు. సమాజ వికాసానికి, మానవజాతి అభ్యుదయానికి పుస్తకాలు మూలస్తంభాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ సుధాకర్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, కాన్పోత్ర, సీఆర్పీ రాజేశ్వర్, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ గోపాల్, మంజుల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **రేపటి నుంచి బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం**

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ ఎన్నికల ప్రచార షెడ్యూల్‌ను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం పటాన్‌చెరులో బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే నెల రోజులపాటు బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రతి గడపకు వెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి విజయానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. 10న పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్ రెడ్డి దేవాలయం ఆవరణలో ప్రచార రథాలకు వాహన పూజలు చేసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు.

◆ **వీరభద్రేశ్వర ఆలయంలో పూజలు**

రాయికోడ్(అందోల్): అమావాస్య సందర్భంగా రాయికోడ్‌లోని భద్రకాళి సమేత వీరభద్రేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం అమావాస్య కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పోటెత్తారు. ఆలయానికి సమీప ప్రాంతాల భక్తులతో పాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు కృష్ణ, వీరయ్య స్వామి, మల్లయ్యస్వామి, బస్వరాజ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ **సామాజిక ఉద్యమాలను బలపరచండి**



జహీరాబాద్ టౌన్: సామాజిక ఉద్యమాలను బలపరచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సామాజిక ఉద్యమాల సంఘీభావ నిధి కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. పట్టణం సమీపంలోని మహీంద్ర అండ్ మహీంద్ర, సీఐఈ తదితర పరిశ్రమల్లో విరాళాలను సేకరించారు. అనంతరం మహిపాల్ మాట్లాడుతూ సామాజిక ఉద్యమాలకు సీఐటీయూ అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తోందన్నారు. మహనీయుల జయంతి, వర్ధంతుల కోసం నిధులను సేకరించి సామాజిక సంఘాలకు అందజేయనున్నట్లు తెలిపారు. సీఐటీయూ పరిశ్రమల కార్యదర్శులు రాజిరెడ్డి, గణేష్, సందీప్ రెడ్డి, నాయకులు బాబు, బాల్‌రాజ్, మసి, సూరి, నరేష్, సురేష్, రాజేష్, మహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

◆ **నియామకం**



ఎంఏ హకీం

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎంఏ హకీం నర్సాపూర్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమిస్తూ జాతీయ మైనార్టీ విభాగం ఉత్తర్వులను వెలువడించింది. ఈ సందర్భంగా హకీం మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **వాహనాల తనిఖీ**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ రింగ్ రోడ్డు వద్ద సోమవారం పోలీసులు ఎన్నికల సందర్భంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నిత్యం సీఐఎస్ఎఫ్ జవానులతో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాహనాల్లో మద్యం, డబ్బు తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.తనిఖీల సమయంలో ప్రజలు పోలీసులకు సహకరించాని కోరారు.

◆ **శనీశ్వర ఆలయంలో భక్తుల సందడి**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శ్రీసిద్దేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గల శనీశ్వరుడిని భక్తులు సందర్శించుకున్నారు. సోమవారం అమావాస్య కావడంతో ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన పూజారి సంగమేశ్వర్ స్వామి ఆధ్వర్యంలో శనీశ్వర స్వామికి తైలాభిషేకం నిర్వహించారు.

◆ **ఎమ్మెల్యే పరామర్శ**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మల్గి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శరణప్ప అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మారుతియాదవ్ ఉన్నారు.

◆ **హరీశ్‌రావును కలిసిన దేశ్‌పాండే**

జహీరాబాద్: మాజీ మంత్రి హరీశ్‌రావును పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాజ్‌కుమార్ దేశ్‌పాండే దంపతులు కలిశారు. ఆదివారం రాత్రి మాజీ మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించుకోవాలన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, ఆదిత్య కుల్‌కర్ణి పాల్గొన్నారు.